ఇల్లు పట్టిన వెధవాడబడుచు

పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు

"ఏరేయి తమ్ముడూ!" "పది మాట్లు చెబుతుం దేమిటి యీ పిచ్చిముండ" అనుకోకు. నువ్వు చిన్నవాడవూ, నేను పెద్దదాన్నీనీ; కానయితే, పంచశిఖలతో వుండగానే నీకు పెళ్లి కావడం బాగానే వుంది; కాని జోగమ్మ యింత తొరగా కాపురానికి వస్తుం దని మే మెవళ్లమూ అనుకోలేదు. మొన్నటి పిల్ల కాదుట్రా తల్లి పెంపు సాంప్రదాయాన్ని పట్టి అలాగ బొబ్బిల్లా వుంది కానీ, పధ్ధానుగేళ్లు వెళ్లలేదురా యింకానూ—ఇంతకీ కోడలు కాపరానికి రావడం అమ్మ కళ్లతో చూసుకుంది. వొక్క కొడుకువైనా అమ్మకి ముచ్చట్లు బాగానే తీరాయి.........ముప్ఫయ్యేకరాల భూమీ, పెట్టెలాంటి యిల్లూ—పదువు పోతే పోయింది యేం లోటు నీకూ? పెట్టి పుట్టావు నువ్వు. బతికి వున్నంత కాలమూ నిన్నూ నాన్ననీ కనిపెట్టుకుని వుంటాను కదా నేనూ? చూడు తమ్ముడూ! మొగుడు చచ్చిన ముండని. ఇల్లు పట్టాను. నువ్వు నిస్సారంగా చూశా వంటే నా ప్రాణాలు యెగిరిపోతాయి సుమా. నీకు నామీద చాలా భక్తే వుంది. ఆ మాట నాకు తెలుసును. అయినా భయం అలా అనిపిస్తుంది.........చెప్పవచ్చిం దేమీ లేదూ. చేబోలువారి ఆడాళ్లు కజ్జాకోర్లు. పైగా నీ అత్తగారు చింతావారి ఆడబడుచు కూడానూ. నెలకి నూటయిరవై రూపాయలు తెస్తా డన్నమాటే కాని పెళ్లాంచేతులో పొయ్యడమే కదా నీ మామగారు? నీ పెళ్లాం అన్నివిధాలా తల్లిని పుణికి పుచ్చుకుంది. ముడి మాటలూ అదీ—నీ భావమరిది పోయినప్పుడు వెళ్లి చూశా నంతా. కావలసినవాళ్లనీ, పుట్టెడు దుఃఖంలో వున్నారు కదా అనీ అక్కడ వున్న పదిరోజులూ వొండి పెట్టాను కాదూ? తల్లి దుఃఖంతో పడి వుండేది కనక తానేనా కాస్త సాయం కావచ్చునా నాకూ? అదేం చదువో గాని అస్తమానం పుస్తకం చేత్తో పట్టుకొని కూచునేది. ఎలా మానగలిగిందో ఆ పదిరోజులూ; ఆరమ్మణీ మాత్రం ముట్టుకోలేదు. ఆడపడుచుముండ నాదునా? ఈడు వచ్చిన పిల్ల కదా; కాస్త ఆసరా కాకూడదమ్మా, చెప్పు తమ్ముడూ. "ఛీ! ఎప్పుడు వెళ్లిపోతానా అనిపించింది.........నువ్వు చిన్నవాడవు కనక యింతగా చెబుతున్నాను. వెయ్యి కళ్లతో నేను కనిపెడుతూనే వుంటాను అయినా—చను విచ్చావంటే నెత్తెక్కుతుంది సుమాను. వ్వంటే భయభక్తు లుండీలాగ మసులుకోవాలి. నాన్న వెర్రిబాగులవాడనీ, నేను మనోవర్తిముండనీ కదా అనీ, నిన్ను లోపు చేసుకోమని యిదివరకే చెప్పి వుంటుంది తల్లి. అబ్బో అసలు నీ పెళ్లామే నెల్లూరు నెరజాణల రకమూ. అవతల పెద్దాళ్లు వున్నారు కదా మన కెందు కని దేని కేనా, కాస్తేనా నదురూ బెదురూ వుం దనుకున్నావా? నువ్వు చిన్నవాడవు కదా అనీ, వేషాలంటే సరదా పడతావనీ, అదనీ యిదనీ నగలికి పురమాయిస్తుంది. విన్నావు సుమా. కావలిస్తే అక్కణ్నుంచి తెచ్చుకోమను డబ్బు. తను వొక్కత్తే కామూ వారికి బిడ్డా? వారి ఆస్తంతా యిక తనకి వచ్చేదే కాదూ?" అని యిలాగ యింకా చాలా దూరం చెప్పింది బుచ్చమ్మ. చలపతిరావు ముసిముసి నవ్వులతో కొంతసేపూ, సిగ్గుచేత కొంతసేపూ, యేమీ తోచక కొంతసేపూ వూరుకున్నాడు; గాని దేనికీ జవాబు చెప్పలేదు. "ఇది బాగా విను" అని వొకటీ, "ఇది ముఖ్యమైనది సుమా" అని యింకొకటీ, "ఇది మరిచిపోయావు సుమా" అని మరొకటీ—యిలాగ యింకా కొన్ని సంగతులు కూడా చెప్పి చివరికి "సిగ్గుపడుతున్నాడు తమ్ముడు" అనుకొని ఆమె కూడా అంతటితో వూరుకుంది.

౨

జగ్గయ్య సరిగా యేడుగంటలికి జోగమ్మని తీసుకువచ్చాడు. "సుబ్బిగాడయితే మాత్రం పేటలోకి పావలా యేమిటే?" అని బుచ్చమ్మ తండ్రిమీద ధుమ

ధుమ లాడింది; కాని జోగమ్మని "మంచినీళ్లు కావాలా?" అనేనా అడగలేదు. బండివాడు సామాను వాకట్లో పెట్టి, అద్దె పుచ్చుకుని వెళ్లిపోగా జగ్గయ్య "సామాను నీగదిలో సద్దుకోవే అమ్మాయీ" అని కోడలితో చెప్పి గోదావరికి చక్కాపోయాడు. దానిమీద బుచ్చమ్మ చుర చుర చూస్తూ "మామగారు చెప్పేదాకా అలా బొమ్మ లాగ నుంచోకపోతే సద్దుకోరాదూ?" అంటూ మూతి ముడుచుకుని వంటింటోకి వెళ్లిపోయింది.

"పెళ్లాం వచ్చాటప్పటికి యెదురుగా వుండ కూడ" దని అప్పగారు చెప్పడంచేత "కామోసు" నను కుని చలపతి గోదావరిగట్టుకి షికారు వెళ్లి యెనిమి దైతే గాని యింటికి రాలేదు. ఈలోపుగా జగ్గయ్య భోజనం చేసి "అబ్బాయి నెక్కడికి పంపించావే?" అని మాటిమాటికి కూతుర్ని అడుగుతూనే గది సావిట్లోకి వెళ్లి పడకమంచం వాల్చుకుని పడుకున్నాడు.

పాపం జోగమ్మకి ఆవంటలో పొద్దున్న తొమ్మిది న్నరకి తిన్న మెతుకులు. దారిలో తినమని తల్లి జంతిక లిచ్చింది; కాని పడవలో మూట మామగారి దగ్గిర వుండ డంచేతా, నిడదవోలు స్టేషనులో జనసమ్మర్దం అధికంగా వుండడంచేతా ఆపిల్ల వాట్లని తలుచుకుని గుటకలు మింగుతూనే కూచుంది. ఈసంగతి యేమీ యెరగని జగ్గయ్య స్టేషనులో "అరిటిపళ్లు కొన మంటావా?" అని అడిగాడు; గాని ఆమె సిగ్గుపడి వద్దంది. మొత్తాని కామె రాజమహేంద్రవరం వచ్చాక అడిగి పుచ్చుకునీ దాకా పచ్చి మంచినీళ్లేనా యెరగదు. తాను గుమ్మంలో అడుగు పెట్టాటప్పటికి ఎంతో ప్రేమతో ఆడబడుచు పీట వేసి కూచోబెట్టి అన్నం పెడుతుం దనుకుంది. అది లేకపోయినా చివరికి చలపతి మొగం కనపడినా కాస్త బాగుండిపోను; గాని అదీ లేకపోయింది.

ఎనిమిదిన్నరకి వంచిన తల యెత్తకుండా గబ గబా నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని, ఆసాయం త్రమే తల అంటుకోవడంచేత నిద్ర కూరుకురాగా చల పతి స్వయంగా పక్క దులుపుకుని పడుకున్నాడు. తొమ్మిదయితే గాని జోగమ్మకి విస్తట్లోకి అన్నం రాలేదు. అప్పుడేనా తెములకుండా బుచ్చమ్మ సావ కాశంగా అదనీ, యిదనీ ఆవంట గొడవ లడుగుతూ, వుండివుండి యిక్కడి కబుర్లు చెబుతూ, మధ్యమధ్య యి రుగుపొరుగు అనుకూలదంపతులికి పేర్లూ పద్దులూ పెడు తూ, కొత్తిమిరి కారంతోటీ, వంకాయపులుసు పచ్చడి తోటీ, మామిడికాయ పచ్చడిబద్దలతోటీ, మధ్యమధ్య వొట్టి నేతితోటీ, చివరికి మీగడ పెరుగుతోటీ కాస్త కాస్త చొప్పున పుప్పపిండి తిని, యిల్లంతా సద్దుకుని, పక్క సవిరించుకుని, "రామయ్యతండ్రీ! నడుం లాక్కు పోయిం" దంటూ పడుకుని, "హుహ్హాహుహ్హా" అంటూ వొకమాటు అటూ యిటూ దొర్లి, జోగమ్మకి సెల విచ్చాటప్పటికి పదిమ్ముప్పా వయింది.

ఇదే తొలిమాటు రావడం కనక తన తమ్ముడు ముద్దుకోసం అయితే నేమి, తన ముచ్చట కోసం అయితే నేమి, లోకంలోవాళ్లని చూసి అయితే నేమి గంధం తీసీ, మల్లిమొగ్గలు తెప్పించీ, అగరువొత్తులు వెలిగించీ —యింకా యింకా యిలాంటివి చెయ్యవలసిన ఆశ బడుచు యిలా చెయ్యకనూ, ఇది యిలా అయినా, యింటోకి వెళ్లాటప్పటికి యెదురు వచ్చి, చెయ్యి పట్టుకు తీసుకు వెళ్లి, వొడిలోనో పక్కనో కూచోబెట్టుకుని, వొక్కమాటు గట్టిగా అదిమిపట్టి, ముద్దుపెట్టి మురిపెం చూపించవలసిన మొగుడు బుస్సలాడుతూ నిద్రపోతూ వుండడమూ, చూసి పాపం ఆపిల్ల తెల్లపోయి, వుసూరు మంటూ కాళ్లకాడదిక్కున పడుకుని నిద్రపోయింది.

3

మూడుగంటలికే బుచ్చమ్మకి మెలకువ వచ్చింది. తరవాత మరి నిద్ర రానూ లేదూ, ఆమె అందుకోసం ప్రయత్నం చెయ్యనూ లేదూ; కాని ఏమిటో మించి పోతూ వున్నట్టు మనస్సు గుబగుబ లాడిపోయింది. వొకటి రెండు మాట్లు మెల్లగ గది గుమ్మంలోకి వెళ్లి తలు పుకి కుడిచెవి ఆనించి, శ్రద్ధగా ఆలకించింది. అయితే: దంపతులలో యెవరూ కూడా మేలుకుని వున్నట్టు తోచలేదు. తరవాత అతికష్టంమీద పూర్తిగా వొక్క గంట గడిపింది. నాలుగు కొట్టాటప్పటికిక పూరుకో

లేక "తెల్లవారిపోతోంది లేచి చదువుకో తమ్ముడూ" అని కేక వేసింది.

మంచంమీద పడుకునే వుండి రెండు మూడు మాట్లిలాగే పిలిచింది; గాని జవాబు రాలేదు. నాలుగో మాటు పిలిచాటప్పటికి జోగమ్మకి మెళుకువ వచ్చింది. అయిదో మాటు పిలవగా ఆమె భర్తను లేపి "మీ అక్క పిలుస్తూ వుం"దని చెప్పింది. దాని కతను ముస ముసలాడుతూ "వూరుకుందూ" అని చెప్పి గోడవేపుకి తిరిగి పడుకున్నాడు. అయితే బుచ్చమ్మమాత్రం వూరుకోలేదు. కేకమీద కేక చొప్పున ఆమె మళ్లీ రెండు మాట్లు పిలిచి, అప్పటికీ జవాబు రాకపోగా "మొగుడుకీ పెళ్లానికీగూడా మొద్దునిద్దరే. ఆడపిల్లక్కూడా బండ నిద్దరే అయితే యెలా గమ్మా వేగడం? పోనీ నీకేనా మెళుకువ రాలేదుటే?" అని సాగదీసుకుంది. దానితో యిక లాభం లేదనుకుని జోగమ్మ లేచి వచ్చి తలుపు తీసింది.

తలుపు తీసీ తియ్యడంలోనే బుచ్చమ్మ లోపలికి దూకింది. అందుకు సిగ్గుపడి జోగమ్మ యివతలికి రాగా "మరీ మంచిదీ" అనుకుంటూ బుచ్చమ్మ మంచం దగ్గిరికి వెళ్లి "ఏవో చదువుకుంటూ వున్నట్టు నటించకపోతే నీ పెళ్లాం లోకువ చేస్తుందిరా" అని చెవిలో చెప్పి చలపతి నివతలికి లాక్కువచ్చింది. అప్పుడు జోగమ్మ మళ్లీ లోపలికి వెళ్లి తలుపు దగ్గిరగా వేసుకుని వుసూరు మంటూ పడుకుంది.

"దీపం పెద్దది చెయ్యవే" అని బుచ్చమ్మతో చెప్పాడు; గాని యే పుస్తకం చదవాలో చలపతికి తోచలేదు. సంవత్సరం కిందట లోవరు సెకండరీ చదువుతూ పెళ్లాము రజస్వల అయిందన్న శుభలేఖ రాగానే బుచ్చమ్మ ప్రోత్సాహంచేత చదువు మానేశాడతను. అప్పటి పుస్తకాలన్నీ యేమయిపోయాయో సోదికి వెళ్లినా యెవరూ చెప్పలేరు. పొరుగింటి పుల్లయ్య దగ్గిర "రైల్వే లిస్టేదరు" దండిగానే వుంది; గాని యిప్పుడెలా వస్తుందీ? తండ్రి దగ్గిర పంచాంగం తప్ప మరేమీ లేదు. అది చలపతికి సుతరామూ నడవదు. ఎంత ఆలోచించినా యేమీ తోచక నాలుగు మాట్లు ఆగూడూ యీగూడూ వెతికే టప్పటికి బుచ్చమ్మ చదువుకునే లంకాయాగం దొరికింది. తానేదో మహా చదివేసి వొరగ తెస్తున్నాడని జోగమ్మ అనుకోవాలని కదా యీ పాట్లన్నీ ని? ఆమె గదిలో నిద్రపోతూ వున్నప్పుడు కాస్తసేపు కాగితాలటూ యిటూ తిరగవెయ్యడానికి యే పుస్తకమైతే యేమీ? ఇలాంటి ధైర్యంతో అతనదే పుచ్చుకుని దీపం దగ్గిర కూచున్నాడు. ఇదంతా చూస్తూ వున్న బుచ్చమ్మ "తెల్లవారడంతోటే నాన్నని పంపి బాలరామాయణ మేనా పెద్దబ్బు అమర మేనా తెప్పించా" లని నిశ్చయం చేసుకుంది.

అబ్బాయిచేత బి. య్యే. ప్యాసు చేయించి "మేస్త్రీటు"పని చేయించా లని జగ్గయ్య యింగ్లీషు చదువులో ప్రవేశపెట్టగా చలపతి ఫస్టుఫారంలోనే దండయాత్రలికి మొదలుపెట్టి ఏడేళ్లకి—అంటే పద్దెనిమిదోయేట థర్డుఫారం చదువుతూ జమాబందీ పూర్తి చేసేశాడు. అంచేత అతని కింగ్లీషు అంటలేదు. పాఠశాలకే బలాదూరు రవడంచేత తెనుగు గుంటపువ్వులు పూసింది. పైగా ఆలంకారయాగం చెన్నపట్నంలో ధబ డధక్క మొదలియారు స్వయంగా పరిష్కరించి స్వకీయ ఆరుముగం ప్రెస్సులో అచ్చువేసింది కూడానూ.

అయితే యేమీ? చమురు నిండా వుండడంచేత దీపం బంతిపువ్వులాగ వెలిగిపోతూనూ వుంది. పుస్తకంలో మొదణ్ణుంచి చివరికీ, చివరనుంచి మొదటికీ కాగితాలు గిర్రున తిరిగిపోతూనూ వున్నాయి. "తమ్ముడు నామాట తీసెయ్యడు" అని బుచ్చమ్మ గర్వపడుతూనూ వుంది. ఇంటో జోగమ్మ యిక్కడ గొడవ లేమీ బోధపడక తెల్లపోతూనూ వుంది. ఇలాంటి సమయంలో యెప్పుడు వచ్చిందో యెవరికీ తెలనకుండా వచ్చి గాఢనిద్ర అందర్నీ అలుముకుంది. భళ్లున తెల్లవారేక అప్పలమ్మ వచ్చి "బుచ్చమ్మగోరూ, బుచ్చమ్మగోరూ" అని పదిమాట్లు తలుపు గుంజేదాకా యెవరికీ మెళుకువ రాలేదు.

౪

అప్పుడేనా అందరిలోనూ ముందు జగ్గయ్య మేలుకున్నాడు. కళ్లు నులుముకుంటూ లేచి కూచుని యెదట చూశాటప్పటి కతనికి వెలవెలపోతూ వున్న దీపం దగ్గిర కొట్టేసిన పాములాగ పడివున్న చలపతి కనిపించాడు. దానికి కారణం తెలవక తట్టి లేపి "యిక్కడ పడుకున్నావేం నాయనా" అని అత నడగ్గా చలపతి "అక్క చదువుకోమంటూ నాలుగ్గంటలికే లేపిం"దని చెబుతూ, తూలుతూ తూలుతూ దొడ్లోకి చక్కా పోయాడు.

ఇదయిన తరవాత వాకట్లో బుచ్చమ్మా, యింట్లో జోగమ్మా వొక్కమాటే లేచారు. ఆ లేవడంలోనూ కూడా బుచ్చమ్మ మరద లివతలికి వచ్చిందా లేదా అని చూస్తూనే లేచి కూచుంది. ఇద్దరూ మొగాలు కడుక్కునేటప్పటికి రెండు బారల పొద్దెక్కింది, అందు కేదో మునిగిపోయినట్టు కంగారుపడుతూ బుచ్చమ్మ తననీ, మరదలినీ కూడా కలిపి "ఏడిసినట్టుగానే వుంది తెలివి. ఇంత పొద్దెక్కేదాకా లేవకపోతే యెలాగా?" అంటూ వొక్కమాటు సాగదీసుకుని, "వంటిల్లు అలుకు" అని మరదలికి పురమాయించి, వీధిలోకి వెళ్లింది. అప్పటి కప్పుడే పక్కయింటి సోదెమ్మ వీధిలో నుంచుని కరివేపాకూ, కొత్తిమిరీ, పచ్చిమిరపకాయలూ — ఇలాంటివి కొంటోంది.

"వొసేవు సోదెమ్మోయి! రాత్రి మా మరదలు వచ్చింది సుమా" అంటూ బుచ్చమ్మ ఆగుమ్మంలోకి వెళ్లగా "నే నలాగే అనుకున్నాను అయితే "వొదినా సుఖంగా పడుకోకుండా నాలుగ్గంటలికే లేపా వెందుకే వాళ్లనీ" అని సోదెమ్మ అడిగింది. తరవాత యిద్దరూ ఆమాటా యీమాటా అందుకున్నారు. "ఇదిగో వచ్చే" అని యింటోవాళ్లకి బదులు చెబుతూనే సోదెమ్మా "వెళ్లాలి. బోలెడు పని వుంది" అంటూనే బుచ్చమ్మా అలాగే నుంచున్నారు. మొత్తానికి అరగంట అయితే గాని ఆయిద్దరూ అక్కణ్ణుంచి కదలలేదు. అప్పుడేనా "అమ్మో! నీ తెలివి తెల్లవారిపోనూ! చెప్పావే కాదేమిటే మాతల్లీ?" అని వొకతే, "అయ్యో! నీ మొగం యీడ్చా! నేను మాత్రం చూశానా యేమిటే?" అని వొకతే అంటూ యిద్దరూ ఈయింటోకి చక్కావచ్చారు. అప్పటి కప్పుడే జోగమ్మ ఆడబడుచు చెప్పిన పని ముగించి, కళ్లకి కనపడిన వొకటి రెండు చిన్న పనులు గూడా చేసేసి, పుట్టింటినుంచి తెచ్చుకున్న సామాను గదిలో సర్దుకుంటోంది.

ఆమె, గుమ్మంలో అడుగు పెట్టాటప్పటికి మొట్టమొదట కనిపించేలాగ బల్లమీద మునిముందు హార్మోనియం వుంచింది. దాని తరవాత ట్రంకూ, బొట్టుపెట్టీ, పాందానూ, పీకిదానూ, వెండిచెంబూ వరసగా పెట్టింది నవలలూ, పాటల పుస్తకాలూ, వసనభారతమూ, సంగీత దర్పణమూ వగైరా పుస్తకాల దొంతర ట్రంకుమీద పెట్టింది. ఇదయిన తరవాత పింపిణవంటల బట్ట విప్పుతోంది. ఈసమయంలో వచ్చారు అక్కడికి ఆ వితంతువు లిద్దరూనూ.

బుచ్చమ్మ పరాయివాళ్ల యింటో చూసినట్టు చూసి మూతి ముడుచుకుంది. సోదెమ్మ మాత్రం అలా కాక అవన్నీ నిదానించి చూసి "మంచమూ, అవీ ఎప్పుడు పెడతారు మీ వాళ్లు?" అని అడిగింది. దానిమీద జోగమ్మ "మా నాన్నా మా అమ్మా నెల్లాళ్లలోవచ్చి, పందిరిపట్టి మంచమూ, పరుపూ, కావడిపెట్టీ, బిందెలూ శెమ్మెలూ, కుర్చీలూ, నిలువుటద్దమూ, కడపరాతిబల్లా, వెండికంచమూ — ఇంకా యిలాంటివి కొని యిస్తా" రని చెప్పింది. "బాగానే వుంది" అని అందుకు సోదెమ్మ సంతోషించగా బుచ్చమ్మ "బోగందాని కిచ్చినట్టు ముందు ఆరమ్మణీ యిచ్చారు కదా?" అంటూ సోదెమ్మ నివతలికి లాక్కువచ్చింది.

అది విని జోగమ్మ చిన్నపుచ్చుకుంది. "అలా అంటా వేమిటే" అని సోదెమ్మ నొచ్చుకుంది.

౫

తరవాత ఆ యిద్దరూ గోదావరికి వెళ్లిపోయారు. అప్పుడే కాఫీహోటలునుంచి వచ్చిన చలపతి హార్మోణి

యం చూశాటప్పటికి కూనిరాగం వుబకగా "సంగీతం బాగా నేర్చుకున్నావా నువ్వూ?" అంటూ గదిలోకి వెళ్లాడు.

"కొంచెం నేర్చుకున్నాను. మీరు కాఫీ పుచ్చుకున్నారా?"

"ఇప్పుడే వచ్చాను వరదారావు హోటలునుంచి"

"నాకు కాస్త వుప్మా తెచ్చిపెట్టరూ?"

"మా అక్కని రానియ్యి"

"ఎందుకూ?"

"మరి డబ్బులో?"

"మీ రెలా పుచ్చుకని వచ్చారూ కాఫీ?"

"ఎప్పుడూ లేదు గాని యెంచేతో మా అక్క తనకి తానే యిచ్చింది డబ్బు లివాళ"

"మీ దగ్గిర డబ్బేమీ లేదూ?"

"తాళం మా అక్క దగ్గిరే వుంటుంది"

"పోనీ నే నిస్తాను తెచ్చిపెట్టండి"

"త్రే"

"ఈ సంగతి రహస్యంగా వుంచుతారా?"

"ఏం?"

"ఏమీ లేదూ"

"మా అక్క అడిగితే?"

"ఆవిడి కెందుకు తెలవాలీ?"

"నువ్వు తినడం చూస్తే?"

"నే నెవరూ చూసేలాగ తినను. మీరు కూడా ఎవరికీ కనపడకుండా నే తేవాలి"

"తరవాత తెలిస్తే మాఅక్క "నాతో యెందుకు చెప్పావు కా"వని గదుముతుంది బాబూ"

"అయితే వొద్దు లెండి. కూచోండి. ఇలా అడిగానని మాత్రం చెప్పకండేం!"

"ఏమీ అనదులే"

"అనడం దాకా యెందుకూ? మీరు చెప్పనే వద్దూ"

"నీకు ముఖారిరాగం వచ్చునా?"

"వచ్చును. చెప్పకండేం"

"చల్ మోహనరంగా' వచ్చునా?"

"తప్పుతప్పు. అది నాకు రాదు. వుప్మా సంగతి మీ అక్కతో చెప్పకుండా వుంటారు కాదూ?"

"పోనీ" "సిరిసిరిమువ్వ పాడగలవా?"

"అదేమి టండీ అలాంటి వడుగుతారూ? మీరు నేర్చుకున్నారా యేమి టవి?"

"దంచేసి పాడతాను నేను"

"మీ అక్క నేర్పిందా?"

"బండి అప్పలసామి నేర్పాడు. అలాంటివి చాలా వచ్చును నాకు. "అప్పనా తనా మనా" "ఓరోరి బండివాడా" "గోంగూరకీ—నేను పాడతాను నువ్వు హార్మనీ వాయిస్తావా?"

"అవి నాకు రావు. నేను వాయించలేను"

"మరేం నేర్చుకున్నావూ?"

"వాతాపిగణపతీ, రామభక్తీ, రామ నీ సమానమూ, మనసు కరుగ దేమీ—"

"వోస్! పూర్వకాల ప్పాటలా? ఇప్పు డెవరి క్కావాలీ అవీ?—పోనీ నీకు వచ్చిం దేదో వొకటి పాడెయ్యి తొరగా"

జో,,మ్మ మనస్సు చివుక్కు మంది. తన భర్త స్థితి అంతా ఆమెకి తెలిసిపోయింది. ఆడబడుచు సంగతి అలా వుండగా యీ వుద్ధ్రతం కూడా యేమిటీ? ఆ పద్ధ్యాలుగేళ్ల పిల్లకి భవిష్యత్తేమీ బోధపడ లేదు. తల తిరిగిపోయింది. ఈకారణంచేత ఆమె నుంచో లేక కుర్చీలో కూలబడగా అదేమిటో యెరగని చలపతి "మా అక్క రాకుండా తొరగా వొక మట్టు పాడేసెయ్యి" అని తొందరపెట్టాడు. దీనితో పుండుమీద కారం చల్లిన ట్టయిందామెకి.

"మీ అక్క వస్తే యేమీ?"

"తిడుతుంది"

"ఎవర్ని?"

"నిన్నూ నన్నూ కూడానూ"

"మీ రింకా ఆవిడిచేత తిట్లు తింటున్నా రా?"

"లేకపోతే చంపెయ్యదూ?"

"అంటే?"

"అన్నం పెట్టదు. గుమ్మంలోకి రానివ్వదు"

ఆమెకి మీది ప్రాణాలు మీదికే యెగిరిపోయాయి వొక్కక్షణం ప్రపంచకం తెలవలేదు; కాని విచారిస్తేనూ, తెల్లపోతేనూ యేం లాభమూ? కన్నీటిని రెప్పలలోనే అప్పళించుకుంది. దుఃఖాన్ని దిగమింగుకుంది. కొంచెం ధైర్యం తెచ్చుకుని యేదో అనపోయింది; గాని అతను పడనివ్వలేదు. "వో పాట పాడు" అని మళ్లీ తొందరపెట్టాడు. హార్మోనియం తీసేదాకా తొందలు విడిపించాడు కూడానూ.

మొగుడెంత తెలివితక్కువవాడైనా పెళ్లాం అన్నాక విధేయత చూపించక తప్పదు కాదూ? మూర్ఖులైన భర్తలు ఈ సద్గుణాన్ని దురుపయోగం చేసినా భారతస్త్రీకి సభ్యత కలిగించిన యోగ్యత యిదే. ఇది వొక్కొక్క చోట దంపతుల అనురాగానికీ సౌఖ్యానికీ భంగం కలిగిస్తూవుండడం నిజమే; కాని ప్రేమ వున్నచోట త్యాగానికి వెనకతీత వుండదు.

చేసేది లేక జోగమ్మ మాట రాకపోగా హార్మోనియం మట్టుకు వాయించసాగింది. "తొలి నే జేసిన పూజాఫలములు" అనే కృతి హార్మోనియంలోనుంచి నింపాదిగా మొలుచుకువస్తోంది; కాని అతని కదేమీ నచ్చలేదు. తనకి వచ్చిన మట్లన్నీ వొక్క నిమిషంలో దానిమీద పాడెయ్యాలని నాలుగు మెట్లమీద వేళ్లు పెట్టి "బొంయి" మనిపించి, యింతట్లో బుచ్చమ్మ వచ్చిన సవ్వడి కాగా గభీమని వొక్క గంతులో యివతలి కుడాయించాడు. జోగమ్మ అందుకే తెల్లపోతూ వుండగా బుచ్చమ్మ బిందె బుజమ్మీద వుంచుకునే యెదురుగా వచ్చి "మా మర్యాదా తక్కనివ్వవూ? నేను బతికివున్నంత కాల మేనా ఆర్మణీ కట్టిపెట్టు. తరవాత నువ్వెలాగా భూమ్మీద మన్నవు" అంటూ గింజుకుంది.

౬

జోగమ్మ ఉలిక్కిపడింది. "ఎందు కిలా తిట్టడం? హార్మణీ వాయిస్తే యేం తప్పా?" అని ఆమె ఎంతో దేవుళ్లాడింది. కానైతే వచ్చినప్పణ్ణుంచీ బుచ్చమ్మ వాలకం తెలుస్తూనే వుంది. అయినా అది యింతలో యింతగా ముదిరిపోతుం దని ఆమె అనుకోలేదు. ఆమె తల్లి అయిన పూర్ణమ్మ మాత్రం యిదివరకే కనిపెట్టింది సంగ తంతానూ. బుచ్చమ్మ, వితంతువై వుండీన్నీ పెళ్లిలో అన్నింటికీ తనే ముందుకు వస్తూ ప్రతీదానికీ పెడర్థాలు తీసి, కుయుక్తులు పన్నడమూ, చలపతిని ఫలహారానికి రానివ్వకపోవడమూ, అక్రమం చంమీద తగని పట్టు పట్టించడమూ, నాగవిల్లి నాళ్ల పట్టుచీర వెనక్కి పెట్టించి తన కూతురికి సాదాచీర యిప్పించడమూ, పూర్ణమ్మ మరిచిపోలేదు. తరువాత రెండుమూడు మాట్లు తమ్ముడుతో తమ యింటికి వచ్చినప్పుడామె చేసిన పెంకితనంగూడా ఆమె మరిచిపోలేదు. మొత్తంమీద మొగుడి అప్రయోజకత్వమూ, ఆడబడుచు రాగతనమూ, తన కూతురికి ముందు ముందు చాలా ముప్పు కలిగిస్తా యని ఆమె ముందే గ్రహించింది.

కనక ఆమె కూతుర్ని అందుకు తగినట్టుగానే తయారుచేసింది. జోగమ్మేనా సహజంగా సింద్రీ గాని వాజమ్మ కాదు. ప్రోల్లో పట్టుచీర వెనక్కి పెట్టించినప్పణ్ణుంచీ ఆమెకి బుచ్చమ్మమీద గుర్రుగానే వుంది. మొగుడు తులసీదా సని యిప్పుడు ప్రత్యక్షంగా తెలియడంతోటే ఆమె భవిష్యత్తుని గురించి ఆలోచనలో పడింది. పైగా "తాళాలు నీ మామగారి చేతులో వుండాలి. లేకపోతే నీ మొగుడిచేతులో వుండాలి; అలాగా లేకపోతే నీచేతులో వుండాలి; గాని నీ యింటో పెత్తనం చెయ్యడానికి ఆడ్డేను గెవరూ!" అని తల్లి చెప్పిన మాట ఆమెకిప్పుడు చట్టున జ్ఞాపకంకూడా వచ్చింది.

అయితే తొలిచూలు వచ్చాటప్పటికే కథ యిలా అడ్డం తిరిగింది. ఇప్పు డేమిటి చెయ్యడం? బుచ్చమ్మకి స్థానబలం వుంది. తండ్రిబలం వుంది. తమ్ముడిబలం వుంది.

కొరుకూ పోరుకూ ఆసరా వుంది. జోగమ్మ కేం వుందీ పాపం? కాస్తైతే ఆమె పిసిండ్రీయే. అందుకు సందేహం లేదు; కాని బంగారపు పళ్లెని నైనా గోడ చేరుపు వుంచాలి. వచ్చీరావడం తోటే కజ్జాకి సిద్ధపడితే జయం మాట యెలావున్నా లోకులు పీకెయ్యరూ? ఏ పోరుకు ముసలమ్మైనా తనకి ఆసరా అవుతుందన్న భరవసా లేనప్పుడు న్యాయపక్షం తన దైతే మాత్రం యేమి లాభమూ? జోగమ్మ యిదంతా ఆలోచించింది. పైగా తల్లీ దండ్రీకూడా కొద్ది రోజుల్లోనే వస్తా రాయె. ఇంతలో తొందర లెందుకూ?

ఇలా అనుకుని జోగమ్మ వోపిక పట్టింది. బుచ్చమ్మ యెప్పుడు చూసినా ధుమధుమ లాడుతూనే వుంటుంది. దీనికి సాయం చలపతి పెళ్లామనీ, అచ్చటనీ, ముచ్చటనీ యెరగ డాయె. అయినా ఆమె తేలిపోలేదు. బుచ్చమ్మ యెన్ని మాట లంటూ వున్నా జవాబు లేదు. వచ్చిన మూడోనాటి రాత్రి తీరా యిక పడుకోడమే అనగా "ఇవాళ హరిశ్చంద్ర నాటకంట కాదూ? చూసివుద్దూ తమ్ముడూ!" అని అర్ధరూపాయ చేతి కిచ్చి బుచ్చమ్మ చలపతిని పంపెయ్యగా ఆరాత్రి మాత్రం జేలపోయి ఆమె వొక్క గంటసేపు కుమిలి కుమిలి యేడ్చింది.

౨

అంహాయస్థితిలో యెలాంటి వాళ్లకీ గూడా ధైర్యం తనంతట అదే వస్తుంది. పైగా అలాగ గంటసేపూ యేడ్చాటప్పటికి జోగమ్మకి కొంత భారం తగ్గిపోయిన ట్టయింది. హృదయం కొంచెం తేరుకుంది. పదకొండయేటప్పటికి నిద్రకూడా పట్టింది.

మూడింటికి చలపతి యింటికి వచ్చాడు. అతగాడు పిలవడమూ, బుచ్చమ్మ తలుపు తియ్యడమూ, "నీ కిప్పుడు నాటకా లేమిటి నాయనా?" అని జగ్గయ్య మందలించడమూ— యీ సందట్లో నిద్రాభంగం కాగా జోగమ్మ మొగుడు యింటోకి వస్తా డని గడియ తీసి వుంచింది; గాని "తెల్లారిపోతోంది" అంటూ బుచ్చమ్మ చలపతికి వాకట్లో అరుగుమీద తుంగచాప పరిచింది.

దీనితో జోగమ్మకి యిందాకటి కంటేనూ యెక్కువ దుఃఖం వచ్చింది. తనవల్ల యేదేనా తప్పుండినా, మొగుడికి తనమీద యేమైనా కోపం వుండినా యిందు కామెకి కష్టం లేకపోవును. కాని యిదేమిటీ?

తనే తుమ్ముకుని తనకి తనే దీవించుకున్నట్టు జోగమ్మ కొంతసేపటికి తన్ను తానే వోదార్చుకుంది,

కళ్ల నీళ్లు తుడుచుకునిగోడ వేపుకి తిరిగి పడుకుని. ఆమె ఆలోచన మొదలు పెట్టింది. "దీనికి వుపాయం యేమిటీ?" అని ఆమె సంగతి యెత్తుకు నేటప్పటికి "బుచ్చమ్మకి యీ పెత్తనం యెలా వచ్చిందీ?" అని యెవరో అడిగిన ట్టయింది ఎలా వచ్చిందీ? చలపతి తులసీదాసు కనక. అతను బుచ్చమ్మ చేతులోవున్నాడు కనక. కనక యిప్పుడు చెయ్యవలసిం దేమిటీ? ముందు చలపతినీ, బుచ్చమ్మనీ విడతియ్యాలి. తనమ్మాలంగా అతన్ని తాను లోపు చేసుకోవాలి. జగ్గయ్య యేమీ కలగచేసుకోడం లేదు కనకనూ, చలపతి స్వయంగా సంసారం దిద్దుకునే టంతవాడు కాడు కనకనూ యింతకంటే మరో వుపాయం లేదు. ఇంకో మార్గం లేదు.

౩

జోగమ్మ యిలా నిశ్చయం చేసుకుని చదరంగపు ఆట మొదలుపెట్టింది; కాని రెండు దినాలు గడిచాటప్పటికే బుచ్చమ్మ యీ సంగతి కనిపెట్టేసింది. జోగమ్మా, చలపతీ యేకం అయా రంటే యిక తన కేం వుందీ? యథార్థంలో అంతే అయినా బుచ్చమ్మకి "మనోవృత్తిముండ" గా మాత్రమే వుండిపోవడం యిష్టం లేదు. ఇంటి పెత్తనం తనే చెయ్యాలి. జోగమ్మని ముప్పతిప్పలూ పెట్టాలి.

మొదణ్ణుంచీ చలపతి తన చెప్పుచేతల్లోనే వుండడంచేత బుచ్చమ్మ "తమ్ముడు నామాటే వింటా" డని మొదట గర్వించింది; కాని చివరికి విమమించేలాగ కనపడగా శ్రద్ధపట్టింది.

మొట్టమొదట బుచ్చమ్మ "పగలు పెళ్లాంతోటి అట్టే మాట్టాడకూడ" దని వొక ధర్మసూత్రాన్ని తమ్ముడికి వుపదేశించింది. తరవాత వొకనాడు జోగమ్మ తల దువ్వడం కోసం మొగుణ్ణి యింటోకి రమ్మని సంజ్ఞ చేసి పిలవగా బుచ్చమ్మ అది కనిపెట్టి "పని వుంది యిలా రా తమ్ముడూ" అని పిలిచి వంటింటి వసారాలో కూచోపెట్టి తానే తల దువ్వేసి పంపేసింది. మర్నాడు తనే తొందరపనిలోనో వుండగా జోగమ్మ చటుక్కున మొగుణ్ణి యింటోకి పిలవడం గమనించి "ఎంత గొంతుక చించుకున్నా పలకవేమిటే మా తల్లీ? అని విసుక్కుంటూ వెంటనే జోగమ్మని ఇవతలికి రప్పించింది. తను గోదావరికి వెళ్లినప్పుడు జోగమ్మ తమ్ముడికి యేం విరుగుడు మాటలు చెప్పి పోతుందో అని ఆమె రెండు మూడు మాట్లు తనతో రమ్మని పిలిచింది; గాని "గోదావరిలోదిగితే నాకు జబ్బు చేస్తుంది బాబూ" అని జోగమ్మ తిరస్కరించేసింది. అంతట "యిది కాదు మార్గం" అని బుచ్చమ్మ సర్గ్గా తను గోదావరికి వెళ్లేటప్పుడు తమ్ముడి కేదో పని పురమాయించి వూళ్లోకి పంపడం ప్రారంభించింది. ఇది గ్రహించి వొకనాడు జోగమ్మ ఆడబడుచు గోదావరికి వెళ్లే ప్రయత్నంలో వుండగానే చలపతిని "తమలపాకులైపోయా" యని బజారుకి పంపి బుచ్చమ్మ గుమ్మం దిగిన వెంటనే యింటికి వచ్చేటట్టు చేసింది. ఇంకో రోజున సరిగా ఆసమయానికి పొరుగింటికి వెళ్లి యేదేనా కథల పుస్తకం తెచ్చిపెట్టమని పంపింది. మరో రోజున వొక కాని డబ్బు చేతులో పెట్టి "చీనాపంచదార తెచ్చిపెట్టండి" అని బజారుకి పంపి బుచ్చమ్మకి కనపడకుండా చేసింది. మర్నాడు బుచ్చమ్మ నెగ్గింది. ఆమర్నాడు మళ్లీ జోగమ్మ గెలిచింది.

౬

ఇలాగ వొక్క వారం గడిచిపోయింది. పైకేమీ గొడవలు కనపడవు; గాని లోపల్లోపల మాత్రం తాపాలు పెరిగిపోతున్నాయి.

ఒకనాడు సోదెమ్మ పెత్తనాలకి వచ్చి కూచుంది. అప్పటికి వాకట్లో కూచుని బుచ్చమ్మ చలపతికి తల దువ్వుతోంది. రూపొందిన అసంతృప్తి లాగ జోగమ్మ స్తంభాన్ని చేరబడి నుంచుని వుంది. సోదెమ్మ కూచుంటూ, కూచుంటూ జోగమ్మ కేసి చూడగా జోగమ్మ సోదెమ్మ కేసి పురపుర చూస్తూ యింటోకి చక్కాపోయింది.

జోగమ్మ చూపుల్లో సోదెమ్మ యేం కనిపెట్టిందో యేమిటో వూరికే కూచోక "నువ్వు దువ్వుతున్నావేమే?" అని బుచ్చమ్మనీ, "పెళ్లాంచేత దువ్వించుకోడానికి సిగ్గా యేమిటిరా బావా?" అని చలపతినీ అడిగి, అంతటితో పోనీయక "చక్కగా క్రాపింగుపెట్టకోక ఆడదానికి లాగు అంత జుట్టేమిటిరా యీ రోజుల్లోనూ?" అని కూడా అడిగింది.

అసలలాంటప్పుడు సోదెమ్మ రావడమే బుచ్చమ్మ కెలాగో వుంది. వచ్చిన మనిషి వచ్చినట్టు నోరు మూసుకుని కూచోక తల దువ్వడం మాట తెచ్చాటప్పటికి ఆమెకి పిసాళం యెత్తుకొచ్చింది. ఆపైని క్రాపింగు మాట తెచ్చాటప్పటికి వొళ్లు మండుకు పోయింది. దానితో బుచ్చమ్మ యిక వూరుకో లేకపోయింది. "నా మొగం చూసేనా అదివూరుకోనప్పుడు దాని మొగం చూసి నేను మాత్రం యెందుకు వూరుకోవాలీ?' అనుకుంది. వెంటనే రుసరుస లాడుతూ "ఇంటో వున్న ఆడపీనుగులు తెలివితేటలూ, భయభక్తులూ వున్నవాళ్లయితే పైవాళ్లు తరుదునమ్మా అని వూసుకు వచ్చి యిలా అడగ్గలరా? సిగ్గు కాకపోతే మాత్రం పెళ్లాం వచ్చాక తక్కినవాళ్ల నందర్నీ తీసిపారెయ్యాలా యేమిటి? తల దువ్వే దిక్కు లేక క్రాపింగూ పెట్టించుకోక, బోడిగుండూ చేయించుకోకపోతే యిక యేం చేస్తాడూ మా వాడూ? గురివిందగింజ తన నలుపెరగదుట. వొకళ్ల యింటో మాత్రం యింత కంటే బాగా యేడుస్తోందా యేమిటీ? అయినా కొంతమంది కదేమిటో కళ్లల్లోనే వుంటుంది విషం" అని విసిరి కొట్టింది.

సోదెమ్మ మనస్సు చివుక్కుమంది. "ఏదో యీ దాలాభంగా అన్నమాటకి యింత అల్లరి యేమిటే మా తల్లీ" అని చాలా నొచ్చుకుని ఆమె యిక అక్కడ కూచో

లేక తటాలున లేచి వెళ్లిపోయింది. అది చూసి "వెళ్లిపో. నా కేం దిగదుతుందా యేమిటి?" అనుకుంది బుచ్చమ్మ వీథిగుమ్మం దాటాక. "దీని కెప్పుడూ యిలాంటి వెధవ గుణాలే" అనుకుంది సోదెమ్మ.

బుచ్చమ్మ ఆరోజంతా సోదెమ్మమీద ధుమ ధుమలాడుతూనే వుంది; కాని యీ ప్రసంగం మాత్రం జోగమ్మకి చాలా వుపకరించింది. ఆ రాత్రి ఆమె చలపతికి తమలపాకుల చిలక లందిస్తూ "ఇందాకా సోదెమ్మ అక్కగా రన్న మాటలు వినికించుకున్నారా? ఏ మొగా డేనా యింట్లో పెళ్లాం వుండగా మరో ఆడదానిచేత తల దువ్వించుకుంటాడా? మీ అక్క మీకు నే నెప్పుడూ తల దువ్వనట్టు ఎలా తేల్చిందో చూశారా?" అని ముద్దుముద్దుగా బుద్ధిచెప్పి, చివరికి "రేపట్నుంచి నాచేతే దువ్వించుకుంటారు కాదూ?" అని నిలవదీసి అడిగింది.

౧౦

నెల్లాళ్లలో వస్తా మన్న జోగమ్మ తల్లీ దండ్రీ పదిహేనురోజులికే వచ్చారు. లెక్కకి పదిహేనే; కాని ఆరోజులు జోగమ్మకి సంవత్సరాలుగా తోచాయి. వారేనా వుండలేకపోవడంచేత నైతే యేమి, నెల ఆఖరుకి కాని రా దనుకున్న సెలవు పదిహేనో తేదీకే రావడంచేత నైతే యేమి పిలిచినట్టు వచ్చారు కనక సరిపోయింది; కాని లేకపోతే యెంత దృఢపరుచుకున్నా ధైర్యం చాలక జోగమ్మ బెంబేలుపడిపోవును. అక్కడికీ, పెట్టిలో పెట్టుకు వచ్చిన మినపసున్ని బుట్టా, అరిసెల బుట్టా పైకి తీస్తూ యేదో తలవని తలంపుగా తన మొహంకేసి చూసి "అదేమే మా తల్లీ అంతగా చిక్కిపోయావు?" అని తల్లి అడిగేటప్పటికి దుఃఖం వుబ్బెత్తుగా పొంగుకు రాగా జోగమ్మ తల్లిమీద వాలి పోయిందమంది.

బుచ్చమ్మ కూడా కూడా తిరుగుతూ వేయి కళ్లతో కనిపెడుతూనే వచ్చింది; అయినా యెలాగో సందుచేసుకుని జోగమ్మ సంగ తంతా తల్లికి చెప్పేసింది. అదంతా వినేటప్పటికి పూర్ణమ్మకి అరికాలి మంట నెత్తికి వచ్చింది. వెంటనే ఆమె బుచ్చమ్మని దులిపెయ్యా లనుకుంది; గాని తాము వెళ్లాక ఆమె యింకా బరితెగుతుం దేమో అని వస్తాయించి, కోరలు తీసిన తాచులాగ బుస్సలు మాత్రం కొట్టింది. లేకపోతే, కంప మీద బట్ట పడినా, బట్టమీద కంప పడినా బట్టకే నష్ట మైనట్టు పుట్టింటివారు తొందరపడినా, అత్తింటివారు తొందరపడినా కోడలుపిల్లకే చిక్కు కదూ?

నాటి మధ్యాహ్నమే అల్లుణ్ణీ, కూతుర్నీ వెంటబెట్టుకుని వేంకటాచలం సకళత్రంగా బజారుకి బయలు దేరాడు. కాని చలపతి వారితో వెళ్లడం బుచ్చమ్మకి సుతరామూ యిష్టం లేదు. వాకట్లో కూచున్నవారు కూచున్నట్టుగానే బయలుదేరడంచేత ఆమెకి చెప్పడానికి వీలు లేకపోయింది. సంజ్ఞ చెయ్యా లని చూసింది; కాని ఆసమయంలో చలపతి బుచ్చమ్మకేసి చూడనే లేదు. సాయంత్రం యింటికి వచ్చాక ఆమె "వాళ్లు రమ్మంటే వెనకా ముందూ చూడకుండా కూడా చక్కాపోతావా?" అని మొదట గదిమే తరవాత "ఏ మేం కొన్నా రేమిటి?" అని అడిగింది.

౧౧

మర్నాడు పొద్దున్న బుచ్చమ్మ "వాళ్లు బయలు దేరేదాకా యెందుకూ?" అని ముందే మేలుకుని "ఈ మూ డణాలూ పెట్టి పెసరట్లు తిని, కాఫీ తాగి ధవళేశ్వరం వెళ్లి రా. రానూ పోనూ జట్కాకి పావలా తగలెయ్యడం యెందుకూ? నడిచి వెళ్లి రా" అని చలపతితో చెప్పింది.

"బజారుకి వెళ్ల వద్దూ?"

"నీ పెళ్లాం వెడుతోంది చాలదూ?"

"నేను కూడా వెడితే యేం?"

"నిన్ను లోకువ చేస్తారురా"

"................"

"కాకపోయినా నీ పెళ్లానికి సామాను కొంటూంటే నువ్వు కూడా యెందుకూ?"

"డబ్బెక్కువైనా అదీ నేనూ కొనమన్న వస్తువులే కొంటున్నారు"

"కూతురు మాట వింటారు; గాని నీ మాట వింటారనుకున్నావా యేమిటి?"

"వింటారంటేనే!"

"అయితే వెళ్లు. నీఖర్మం. నా కేం?"

చలపతికి కడుపులో రాయి పడింది. వెడితే యేమిటో, వెళ్లకపోతే యేమిటో? పది రోజుల కిందట అయితే అతని కీ తటపటాయింపు లేకపోవును. ఇప్పుడు ద్వంద్వప్రభుత్వం వచ్చింది. కానైతే బుచ్చమ్మ అధికారం ముందు జోగమ్మ అధికారం తీసికట్టే; అయినా నిరంకుశత్వానికి ప్రతిష్టంభనం అంటూ వొకటి ప్రత్యక్షం అయింది.

చలపతికి బజారుకి వెళ్లాలని యెంతైనా సరదాగా వుంది. వెడితే తనూ పెళ్లామూ వొక బండిలో కూచుని, నిన్నటి లాగ జోగమ్మ చాటుగా తమలపాకుల చిలకలందిస్తూ వుంటే పుచ్చుకుని దర్జాగా వేసుకో వచ్చు. పైగా—ఇవాళ మామగారు తనకి కోరిన కుర్చీ కొంటాడు.

కనక "ధవళేశ్వరం వెళ్లకపోతే యేం?" అనుకున్నాడు; గాని అతనికి ధైర్యం చాలలేదు.

ఒకరి కేసి వొకరు చూసుకుంటూ అక్కా, తమ్ముడూ వొక్క-క్షణం అలాగే నుంచున్నారు. ఉత్తరక్షణంలో అతని దుర్బలహృదయంలో వొక మెరుపు మెరిసింది. వెంటనే "తే" అని మూడణాలూ పుచ్చుకుని, బుచ్చమ్మ తలుపు తియ్యగా అతను దొడ్డిదారిని బయలుదేరాడు. నాలు గడుగులు వేశాక బుచ్చమ్మ చిటికెలు వేసి వెనక్కి పిలిచి, "పది గంటలికి. తెలిసిందా? ఈలోపున ఇంటికి రావద్దు" అని కళ్లు పులకరించుకుంటూ ఆజ్ఞాపించింది. "సరే" అని అతను వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ, కప్పలాగ వురుకుతూ నిమిషంలో మలుపు తిరిగాడు. "వీళ్ల కింతే కావాలి" అని బ్రహ్మానందపడుతూ బుచ్చమ్మ యింటోకి చక్కాపోయింది.

౧౨

ఎనిమిదింబావయింది. "అమ్మా! ఈపాటికి కొట్లు తెరుస్తారు లేవండీ తొరగానూ" అంటూ వెంకటాచలం కూతుర్నీ, భార్యనీ తొందరపెట్టి "చలపతీ!" అని పిలవగా జవాబు రాలేదు. జోగమ్మ పడకగదీ, పెరడూ చూసింది; గాని కనపడలేదు "మీ తమ్ముడేడీ?" అని పూర్ణమ్మ అడగ్గా "ఏమో? నే నే మెరుగుదునూ?" అని సాగదీసుకుంటూ బుచ్చమ్మ నూతికి వెళ్లిపోయింది.

వెంకటాచలం పూర్ణమ్మ కేసి చూశాడు. పూర్ణమ్మ జోగమ్మ కేసి చూసింది. "ఎక్కడికో పంపేసింది" అని జోగమ్మ అనగా "అవును; ఆపీనుగు పనే యిదీ" అని పూర్ణమ్మ పళ్లు కొరికింది.

వెంకటాచలం వొక్క బండే తీసుకు వచ్చి బజారుకి బయలుదేరదీశాడు. వాళ్లు గుమ్మం దిగడంతోటే బుచ్చమ్మ మండువాలోకి వచ్చి వీధి కేసి చూస్తూ "ఇక గింజుకోండి...మహా బాగా చేశాను కానూ?" అంటూ రాకాసినవ్వు నవ్వుకుంది.

*   *   *   *   *

బండి కూరల బజారు దగ్గిరికి వెళ్లింది. బండి వెనక్కాల నడుస్తూ వెంకటాచలం కూతురుతో యేమిటో చెబుతున్నాడు. పూర్ణమ్మ జోగమ్మకి దాన్నే నచ్చచెబుతోంది. జోగమ్మ కొంచెం విచారంగా వున్నట్టు కనబడుతోంది.

ఎక్కణ్ణించి వచ్చాడో యిలాంటప్పుడు, ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ చలపతి చక్కావచ్చాడు; గాని వెంకటాచలం "యెక్కడికి వెళ్లావోయి?" అని అడిగేదాకా పూర్ణమ్మా, జోగమ్మా కూడా అతగాణ్ణి చూడలేదు.

"ఎక్కడికి వెళ్లారండీ?"

"..............."

"మాట్లాడరేం?"

"..............."

"నువ్వే వెళ్లావా యెవ రేనా వెళ్ల మన్నారా నిన్ను?"

"ఏ మయితే యేం? వూరుకోం డింక. సమ యానికి వచ్చాడు కదా?"

దానిమీద యెవరూ మాట్లాడలేదు. చురుకూ చురుకూ చూస్తూ జోగమ్మ చోటిచ్చింది. మామగారు నడుస్తూవుండగా తాను బండెక్కవచ్చునా కూడదా? అని అనుమానిస్తూనే చలపతి బండెక్కాడు.

అత్తగారూ మామగారూ పరధ్యానంగా వున్న సమయం కనిపెట్టి చలపతి జోగమ్మ వొళ్లో వొక కిల్లీ పడేశాడు. జోగమ్మ కూడా దాన్ని చడీ చప్పుడూ లేకుండానే నోట్లో వేసుకుని చలపతిలో కలుగుతూ వున్న మార్పుకి చాలా చాలా ఆనందించింది.

* * * * *

పదిన్నరకి, కొనవలసిన సామా నంతా అయింది. వైగ్రాం రోడ్డు దగ్గిరకి వచ్చాక చలపతి బండి దిగి నాళంవారి సత్రం కేసి వెళ్లిపోయాడు.

వెంకటాచలం, జోగమ్మకోసం కొన్న సామా నంతా వాకట్లో పెట్టి వియ్యంకుడికి చూపిస్తూ వుండగా చలపతి యింటికి వచ్చాడు. అది చూసి "నువ్వు బజారుకి వెళ్ళలేదుట్రా నాయనా?" అని జగ్గయ్య అడిగాడు.

"ధవళేశ్వరం వెళ్లి వచ్చాను?"

"ఎందుకూ?"

"అక్క వెళ్లి రమ్మంది"

"ఏం పనీ?"

"..............."

"సంసారికి అనేకపను లుంటాయి. అడిగీ దేమిటి బావగారూ?"

వెంకటాచలం యిలా అనేటప్పటికి దాని భావం బుచ్చమ్మమీదికి మొగ్గి వున్నట్టు జగ్గయ్య అవమాన పడ్డాడు. బుచ్చమ్మ తమ్ముణ్ణి వంటింటోకి పిలిచి "నేను ధవళేశ్వరం వెళ్లి రమ్మన్నా నని వాళ్లు వినీలాగ చెబుతావా నాన్నతోటీ?" అని కళ్లెర్ర జేసింది.

౧౩

"మీ అమ్మా మీ నాన్నా వెళ్లారా యింకా వున్నారా చెల్లాయీ?"

జోగమ్మ నూతిదగ్గిర వెండికంచం కడుగుతూ వుండగా యీ మాట వినపడింది. ఆమె అటూ యిటూ చూసింది గాని యెవరూ కనపడలేదు.

"ఇక్కడున్నాను నేను"

అని మళ్లీ వోమాట వినపడింది. ఈమాటు వెనక్కి తిరిగి చూడగా గోడ అవతల కరివేపచెట్టు కొమ్మల్లో నక్కి సోదెమ్మ మాట్లాడుతోంది.

"ఇంకా వెళ్ళలేదు అక్కయ్యగారూ! ఇప్పుడే వచ్చి బజార్నుంచి, భోజనాలు చేశాము"

"సామా నంతా కొనడం అయిందా?"

"అయింది. వచ్చి చూడరూ?"

"నువ్వు రమ్మన్నప్పుడు వచ్చి చూస్తాను"

"ఇప్పుడు రమ్మనడం లేమూ?"

"ఇలా కాదు"

"............"

"............"

"ఈజన్మలో అలాంటి అదృష్టమే నాకూ?"

"అలా అనకు. అంతా నీదే. తక్కినవాళ్లు నాలుగు మెతుకులికి చేరినవాళ్లే"

"నేనే యిప్పుడలా వున్నాను"

"నిన్ను చూస్తే నా కేడుపు వస్తోంది. దిక్కుమాలిన పీనుగు చూస్తే పీకేస్తుంది. మరొకప్పుడు మాట్లాడుకుందాము వెళ్ళమ్మా"

"ఉపాయం—"

జోగమ్మ మాట పూర్తి కాకుండానే సోదెమ్మ వెళ్లిపోయింది. అందుకు జోగమ్మ చాలా యిదయింది;

గాని తటాలున ఆమె హృదయంలో కొన్ని ఆలోచనలు చెలరేగాయి. వెంటనే కంచం కడిగేసి ఆమె యింటోకి చక్కాపోయింది.

*　　*　　*　　*　　*

జోగమ్మా తల్లీ పడకగదిలో నుంచుని ఏమిటో చెప్పుకుంటున్నారు. కిటికీతలుపులు తీసివుండడంచేత వీధిలో వాళ్ళంతా వారికి కనపడుతున్నారు.

బుచ్చమ్మ వీధిగుమ్మంలో నుంచుంది. వొక వృద్ధబ్రాహ్మడు వీధిలో నుంచుని "ఈయిల్లు యెవరిదండి?" అని అడిగాడు.

"మాదే"

"మీ యింటి పే రేవరండి?"

"..............."

"మీ యింటి పే రేవ రండీ?"

"మా యింటి పేరా?"

"అవును"

"ఎందుకూ?"

"వూరికేనే"

"మా యింటి పేరు ముద్దూరివారు"

"..............."

"మీ కెవరి యిల్లు కావాలీ?"

"కల్లూరివారిది"

"అలా వెళ్ళండి. ఆడాబా యిల్లే"

ఇలా చెప్పి బుచ్చమ్మ యింటోకి చక్కాపోయింది. ఈమాటలు గదిలో వున్న తల్లికీ కూతురికీ కూడా వినపడ్డాయి.

"ఈయిల్లు ముద్దూరివారి దని తేల్చింది చూశావా?"

"ఇంకా రెండేళ్లు పోతే నీ యింటి పేరే పైకి రానివ్వదు. పెళ్లి అయింది; ముండామోసి యింటికి చేరుకుంది; గాని దాని యిల్లని నడివీధిలో నుంచుని చెబుతోంది"

"ఇందుకోసమే కాబోలు యిందాకా సోదెమ్మ అక్కగారు అలా అన్నారు. ఎలాగే అమ్మా మరీ?"

"ఎలాగే అంటే యేం వుందీ?...ఇంతకీ నీమామగారికి కష్టంగా వుంటుం దేమో అని—"

ఇంతలో వెంకటాచలం వచ్చి "యేమి టమ్మా?" అని అడిగాడు. "ఏమీ లే దండీ నాన్నగారూ" అని జోగమ్మ బదులు చెప్పి కళ్ళల్లో నీళ్లు తెచ్చుకుంది. అది చూసి అతను "ఎందుకూ?" అని అడగ్గా పూర్ణమ్మ సంగతి అంతా చెప్పి "కందుకూరివారి యిల్లని చెప్పకపోవడం యేమీ? అని అమ్మాయికి కష్టంగా వుంది" అని చెప్పింది.

"ఆమాటలు నేనూ విన్నాను; గాని మన బంగారం మంచిది కాదు. వూరుకోండి"

"అతనికి చేతగాకపోతే అమ్మాయి చేసుకుంటుంది పెత్తనం. మధ్య నీ పీను గెవ రండీ?"

"కొంచెం వోపిక పట్టాలి. కోడలికన్నా ఆడబడుచుకే అధికారం యెక్కువ వుండే యిళ్లుకూడా చాలా వున్నాయి. తొందరపడకండి"

"ఎన్నాళ్లూ?"

"చలపతికి జ్ఞానం వచ్చేదాకానూ"

"అందాకా అమ్మాయి బతుకుతుందా?"

"..............."

"ఇక నేను లేనని అనుకోండి నాన్నగారూ?"

జోగమ్మ యిలా అనేటప్పటికి వెంకటాచలానికి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. పూర్ణమ్మ కూతుర్ని పొదివిపట్టుకుని "నీకేం భయ మమ్మా? మనోవృత్తిమనిషి, అదేం చెయ్యగల దమ్మా నిన్ను?" అని వోదార్చి "ఇంకో వారం రోజులు. సెలవు కావా లని పైకి రాయండీ. ఆవారమూ కూడా చూసి, వీలు లేకపోతే అమ్మాయినీ, అల్లుణ్ణీ కూడా మన యింటికే తీసుకువెడదాం" అంది.

"ఆపీనుగు రానిస్తుందా అమ్మా?"

"అదీ నిజమే. ఏమంటా రండీ మీరూ?"

"చలపతి మన యింటో వుంటే? ఇక్క డేమా తుందో?"

"అదీ నిజమే. గండ కత్తెర వచ్చి పడిం దండీ యీభూతంతోటీ"

"సరే. ముందు సెలవు పుచ్చుకుని వస్తాను" ఇలా చెబుతూ వెంకటాచలం సూపర్నెంటుఆఫీసుకి వెళ్లాడు.

౧౪

"ఇంతకం టె సయ్యోద్ధ్యలు వుండి యేడుస్తాయా యేమిటి ముందు? ఏ మయినా సరే వొక మాటు సోదెమ్మగారి యింటికి వెళ్లి వస్తానే"

"నేనూ రానా?"

"కళ్లల్లో నిప్పులు పోసుకోమా?"

"..... ...."

"పోనీ మీ నాన్నని యింటికి రానీ"

ఇలా అనుకుని తల్లీ కూతురూ వాకట్లోకి వచ్చాటప్పటికి జగ్గయ్య వచ్చి "అమ్మా! వంటిల్లు సద్దాలి కామోసు చూడమ్మా" అన్నాడు. అది విని జోగమ్మ పూర్ణమ్మకేసి చూసింది. పూర్ణమ్మ "బతికాం" అని నింపాదిగా అని "నువ్వు కూచో అమ్మా! నేను సద్దుతాను" అని వంటింటోకి వెళ్లగా, చిటికెలు వేసుకుంటూ జోగమ్మకూడా తల్లి వెనక్కాల వంటింటోకే వెళ్లింది.

*   *   *   *   *

"అక్కయ్యగారూ!"

"..............."

"పీథిగదిలో వున్నట్టుంది. వినపడుతుం దేమోనే"

"వినపడదు...అక్కయ్యగారూ?"

"..............?."

"ఆవిడ వాకట్లో వుందేమోనే అమ్మాయీ"

"ఇంకా వంటింటోనే వున్నారు..."అక్కయ్యగారూ!"

"చెల్లీ!"

"ఏం చేస్తున్నా రండీ?"

"వంటింటో పని అయిపోయింది. వాకట్లోకి వెడదాం అనుకుంటున్నాను"

"మూడు రోజులు పండుగు వచ్చిం దండీనాకూ"

"ఎచ్చిందా? వెయ్యిమంది దేవుళ్లకి మొక్కుకుంటున్నాను మీ వాళ్లు వుండగా యిలా రావా లనీ. మీ అమ్మ ఏం చేస్తున్నారూ?"

"ఇక్కడే వుందండీ. మా అమ్మ మీ యింటికి రావా లనుకుంటూ వుండగా, మామగారు "యిల్లు సద్దమ్మా" అని చెప్పారు నాకు"

"వెర్రి బ్రాహ్మడు. ఏమీ యెరగడు పాపం. సత్యరుషీ. అంచేతే అలా ఆడుతోంది ఆట. పిన్నిగారూ!"

"వింటున్నా"

"అలా రండి దొడ్లోకి"

"వస్తున్నా. నువ్వు సద్దుకోవే తల్లీ వంటిల్లు"

ఇలాగ చెబుతూ పూర్ణమ్మ దొడ్లోకి వెళ్లగా "ఎక్కడికి పంపించందో యింటో లేకుండానూ?..... ఈ మూడు రోజులూ కంట పడనివ్వకూడదు" అనుకుంటూ జోగమ్మ పనిలో ప్రవేశించింది.

౧౫

చలపతి బజారులో కిల్లీ కట్టించుకుంటూ వుండగా వెంకటాచలం చూసి "ఇంటో తమలపాకు లయిపోయాయిట యెరుగుదువా?" అని అడిగాడు.

"నే నెరగను"

"మరి కనుక్కోవద్దూ?"

"తమలపాకులు తెస్తే మా అక్క తిడుతుంది"

"ఏం?"

"ఏమో"

"మీ నాన్న తిడతారా?"

"మా నాన్న తెచ్చుకోమనే అంటాడు. "సంసార్గం కాదూ?" అని మాఅక్కే వల్లకాదంటుంది"

"సంసార్గం కనకనే కావాలి. తెలిసిందా? మా అమ్మాయికి చిన్నప్పణ్ణుంచీ తాంబూలం అలవాటూ. అది లేని రోజు దానికి వుపవాసమే. మేము వెళ్లీదాకా నేనే కొంటాను. తరవాత నువ్వు తెస్తూ వుండాలి సుమా. డబ్బులు మా అమ్మాయే యిస్తుందిలే. భయపడకు."

"అలాగే లెండి"

"మారల బజారు దగ్గిర కవటాకులు వున్నాయి. పుచ్చుకుందాము రా"

మామగారు కొన్న తమలపాకులూ, అవ్వీ పట్టుకుని చలపతి ఆనందంతో యింటికి వచ్చాడు. మామగారి చేతులో యేవో రెండు పొట్లా లుండడం చూసి అవి ఫలహారపు వస్తువు లని అనేను వూరుతూ వచ్చాడు; గాని గుమ్మంలోకి వచ్చాటప్పటికి అరుగుమీద బుచ్చమ్మ కనపడగా అతని మొగం గూకుక్క పోయింది. పూర్ణమ్మా, వెంకటాచలమూ వుండగా తాను బైట చేరినందుకే వుడికిపోతూ వున్న బుచ్చమ్మ, యిది చూసి తల నేల నేసి కొట్టుకున్నంత యి దయింది."

*   *   *   *   *

"వెళ్లక్కర్లేదు"

"మా అక్క పిలుస్తోంది"

"మునిగిపోయీా పనేమీా లేదు అవతల"

"ఇప్పుడే వస్తాను"

"ఇప్పుడే వెడుదురు గాని"

"............"

"మా నాన్న గారు ఫలహారాలు తెచ్చారు పుచ్చుకుందాం కుర్చీలో కూర్చోండి"

"............"

"కాఫీ కూడా వుంటే బాగుంటుంది కాదూ?"

"స్ట్రాంగు కాఫీ అయితే మరీ బాగుంటుంది"

"తెస్తారా?"

"............"

"డబ్బులు నేనే యిస్తాను బెంగపెట్టుకోకండి"

జోగమ్మ వాకట్లోకి వెళ్లగా, వెంకటాచలం చలపతిని పిలిచాడు. జోగమ్మ వెండిచెంబు అందించింది. వెంకటాచలం వొక రూపాయి చేతులో పెట్టి "అయిదు కప్పులు కాఫీ, ఏబులం కారాబూందీనీ" అని చెబుతూ వీధిగుమ్మం దాకా వచ్చి సాగనంపాడు. చలపతి బుచ్చమ్మకేసి చూసి బెదురుతూనే వెళ్ళగా "యీా మూడు రోజులూ యిక వీళ్లు భాగోతం ఆడేస్తారు" అనుకుంటూ ఆమె మొగం మాడ్చుకుంది.

౧౬

జోగమ్మ గదిలో కూచుని ఫలహారం చేయిస్తూ తాను గూడా చేస్తూ చలపతికి మరోబోధ చేస్తూ వుండగా పూర్ణమ్మ వంటింటి వసారాలో జగ్గయ్యకీ, వెంకటాచలానికీ ఫలహారాలు వడ్డించింది. అది చూశాటప్పటికి ప్రాణాలు లేచిరాగా జగ్గయ్య "ఇదేమి టండోయి భావగారూ? మాయింటో మీాకు మేం చెయ్యావలసిన మర్యాదలు మాకు మీారే మొదలు పెట్టా రేమిటి?

"మా యింటోనూ మేమే చెయ్యాలి, మీా యింటోనూ మేమే చెయ్యాలి మీాకు. ఆడపిల్లని కన్న వాళ్ళం కాదుటండీ మేమూ? మా సంగతంతా మీా అనుగ్రహంమీాదే ఆధారపడివుంది"

"మా అనుగ్రహం యెందుకూ? మీా అనుగ్రహమే వుండాలి మాకు. చలపతి భారం అంతా మీాదే"

"మీా అమ్మాయి మా దాకా మిగిలితే కదా?"

వెంకటాచలం యిలా అనగా పూర్ణమ్మ అందుకుని "ఈకాలపు మొగపిల్లలికి యెవరూ చెప్పనే అక్కర్లేదూ? అయినా ఆలోటు లేకుండా బుచ్చమ్మ దిద్దుతూనే వుంది చలపతిని" అని సన్నాయి నొక్కులు నొక్కింది.

జగ్గయ్య వులిక్కిపడ్డాడు. జోగమ్మ వచ్చినప్పణ్ణుంచీ బుచ్చమ్మ వాలకం అంతా కాకపోతే కొంతే

నా తెలుస్తూనే వుంది; గాని కజ్జా అంటే వెనక్కి తీసే వెంకటాచలం యిలా అనడంచేత అది దుర్భర మై పోయివుంటుం దని అతను వూహించాడు.

తరవాత యెవరూ మాట్లాడలేదు. వొకదాని తరవాత వొకటి చొప్పున వారు ఫలహారం పూర్తి చెయ్యగా పూర్ణమ్మ కాఫీ యిచ్చింది. అంతా అయి పురుషు లిద్దరూ లేచారు. లేస్తూ లేస్తూ జగ్గయ్య "భావగారూ! సంగ తంతా మీకూ తెలుసును నాకూ తెలుసును. ఈపాటికి మీ రీవూరు బదిలీ చేయించు కోండి" అని చెప్పాడు.

ఇది విని వెంకటాచలం పూర్ణమ్మకేసి చూడగా ఆమె కళ్ళల్లో "వొప్పుకోండి" అన్నట్టు ఆత్రం తొణికిసలాడిపోతోంది.

"ఈ విషయం మీరు మీ అమ్మాయితో ఆలోచించారా?" అన్నాడు వెంకటాచలం.

"అవసరం లేదు. అలా చేస్తే మీరు మీ అమ్మాయికి సంరక్షణ చేసినవారూ అవుతారు. చలపతి బాగూ పడతాడు"

"ఒక్కర్లు కూడా యేమేనా—"

"మనం ద్వంద్వాతీతులం కాము. నా కొడుకు బాగుపడడమూ, నా వంశం వృద్ధి కావడమూ—ఇదే నాకు ప్రధానం, తప్పకుండా బదిలీ కోరుకోండి"

"మీ సెలవు"

"సెలవో, ఏదో మీకే తెలుసు"

"అలాగే చేస్తాను"

"అయితే సంతోషమే. ఇప్పటికి వొక భారం తగ్గి పోయింది నాకు"

ఇలా అనుకుంటూ పురుషు లిద్దరూ హాల్లోకి వెళ్ళిపోగా "ఆవున్న భారా లేమిటో యింకానూ!" అనుకుంటూ పూర్ణమ్మ స్థలశుద్ధి చేసేసి, ఈ సంగతి కూతురితో చెప్పడానికి వాకట్లోకి వెళ్ళింది. అప్పటి కప్పుడే జోగమ్మ తాంబూలాలు కూడా ముగించుకుని, గోడలికి తగిలించడానికి కొత్తగా కొన్న పటాలు చల పతి కందిస్తోంది.

౧౭

ఆవేళా, మర్నాడూ, ఆమర్నాడూ కూడా జోగమ్మ గాని, చలపతి గాని వీధిగుమ్మం తొక్కి చూడలేదు. ఎలాగేనా చలపతి నివతలికి రప్పించాలని బుచ్చమ్మ అభూతకల్పనలు చాలా చేసింది; గాని వొకటీ కూడా సెగ్గ లేదు. ఎన్నిమాట్లు పిలిచినా చలపతి పలకడమే మానేశాడు. చాలా సేపు గుట్టుగానే పడివుండి చివరికి పట్టలేక పూర్ణమ్మ నడగ్గా "ఏమో? నే నే మెరుగుదునూ?" అని తన మాట తనకే అప్పగించేసి లోపలికి వెళ్ళిపోయింది. "ఇదిగూడా చూసే వొది లెద్దాం" అనుకుని "తమ్ము డేం చేస్తున్నాడు నాన్నా?" అని అడగ్గా అతను నిర్లక్ష్యంగా జవాబు చెప్పి వీధిలోకి వెళ్ళిపోయాడు.

దీనితో ఆమెకి వుక్రోషం వుబ్బెత్తుగా పెరిగి పోయింది. వూసిపోడాని కేనా మాట్లాడేవాళ్లు లేకపోవడంచేత సోదెమ్మని విసిరికొట్టిన దుడుకుతనం ఆమె కిప్పటికి బోధపడింది. ఇంతకీ "సోదెమ్మగూడా వాళ్ళతో కలిసిం దేమో" అని ఆమెకి అనుమానం కూడా కలిగింది.

ఇక యేమిటీ చెయ్యడం? వొళ్లంతా చీమలూ, జెర్రెలూ పాకిన ట్టుండగా ఆమె ఆవేళ రాత్రి ఆకల్లే దని చెబుతూ పిండి తినడం మానేసింది. రెండో రోజు రాత్రి సగం సగం తిని మజ్జిగ పోసుకోకుండా లేచి పోయింది. మూడో నాడు మధ్యాహ్నం ఆర్యాపురం వెళ్లి విందు కుడిచి వచ్చింది; గాని యేం చేసినా యెవరూ యేమీ అనలేదు.

ఏమీ తోచక మూడో నాడు సాయంత్రం గోదావరికేసి షికారు బయలుదేరగా అక్కడ బయట చేరిన వొక స్నేహితురాలు కనబడి లోకాభిరామాయణం విడేసింది. కొంతసేపటికి పుట్టింటారు వచ్చి జోగమ్మకి సామాను కొనడం మాట వచ్చింది. అందులో చల

పతి దగ్గిరవుండి స్వయంగా కుర్చీ యేరుకున్న సూక్ష్మాతి సూక్ష్మవిషయం కూడా బైటికి వచ్చింది.

దానితో బుచ్చమ్మకి కొట్టినంత పనయింది. "మూడణాలు పుచ్చుకుని కూడా యింత పని చేసిన చలపతి యింకా యెంత పని చేస్తాడో—వాళ్లు చేయిస్తారో?" అని గాభరా పుట్టింది. వెంటనే—యిక అక్కడ క్షణ మేనా వుండలేక, కొంప మునిగిపోతోం దన్నంత కారణం యేదో కల్పించి, అమాంతంగా లేచి నుంచుని, "కాస్సేపు వుండవే మాతల్లీ" అని రెండో ఆమె కొసురుతూ వుండగానే గిరుక్కున వెనక్కి మళ్లింది.

౧౮

బుచ్చమ్మ యిలా గోదావరికి బయలుదేరగానే పూర్ణమ్మ కోవాబిళ్ళలు తెమ్మని చలపతిని కాఫీహోటలుకి పంపింది. ఆమె "వెంటనే రావాలి సుమా" అనే చెప్పింది. గాని వరదారావు హోటల్లో అవి అయిపోవడంచేత అతనికి దామోదరరావు హోటలుదాకా వెళ్లవలసివచ్చింది. అక్కడికీ కోవా పుచ్చుకున్న తరవాత అతగాడు వాయువేగ మనోవేగాలమీదే బయలుదేరాడు; గాని నోరివారి యింటి దగ్గిరికి వచ్చాటప్పటికి బుచ్చమ్మ కలుసుకుంది. దానితో ప్రాణాలు ఎగిరిపోయినట్టు కాగా నిర్ఘాంతుడై పోయి అతను కదలలేక పోయాడు.

"అనుగ్రహం తప్పిన ట్టుందే?"

"............"

"మాట్లాడవేం?"

"............"

"వొద్దన్నారా మేమిటి వాళ్లు?"

"............"

"మొగం అలా తిప్పుకుంటావేం?"

"............"

"వినపడ్డం లేదుట్రా?"

"ఏం?"

"ఏం జరుగుతోం దేమిటి?"

"............"

"ఇలా చూడూ"

"............"

"అయిపోయింది అయ్యా పని"

"............"

"ఎంతలో తిరిగిపోయిందిరా కాలం? ఏదో మందు రాశారు పెద్దమ్మవారుకి"

"............"

"నే ననుకుంటూనే వున్నాను. మాయలమారి పీనుగు లెంత పనేనా చేసేస్తారు. కాకపోతే వాళ్లిక్కడ వుండగానే నాకీ గ్రహచారం రావాలా? పండువంటి సంసారం యిక కుక్కలికీ నక్కలికీ అయిపోతుంది కామోసు"

"............"

"వోరి చెవలవాజమ్మా! ఇప్పటికేనా కళ్లు తెరుచుకో. చెడిపోకు. పెళ్లాం పీనుగు చెప్పినట్లా వింటావుట్రా?"

"............"

"మొన్న నువ్వెక్కడికి వెళ్లావూ?"

"నువ్వు ధవళేశ్వరం వెళ్లమన్నావు కాదూ?"

"వెళ్లావా?"

"ఆ"

"ఛీ! నీ బతుకాలా! పెళ్లాం వెనకాలే బజారుకి తగులడి—ఏం పోగరు పట్టేవురా?"

"ఎవరు చెప్పారమ్మా నీకూ?"

"ఇంకా బుకాయిస్తావా?"

"నే నక్కడికే వెళ్లాను"

"ఛి ఛీ! నోరు ముయ్యి"

"............"

"సరే. ఇక నీయిష్టం వచ్చినట్టు తగులడు. నా కేం? కాని పీనుగులి కెంత సాయం చేసినా బూడిదలో పోసిన పన్నీరే అయిపోతుంది"

"............"

"ఎంత కష్టపడ్డానురా నీకోసం? చివరికెంత గొంతు కోశావురా నవ్వూ?"

"............"

"వెళ్లి పోతావుట్రా?"

"............"

"ఇలా రావూ?"

"............"

"ఇప్పుడేనా బుద్ధి తెచ్చుకో"

"............"

"నేను చెప్పినట్లు వినవూ?"

"ఏం చెయ్య మంటావూ?"

"నే నింటోకి వచ్చేదాకా వాళ్లతోటి మాట్లాడకు"

"............"

"నా మాట విను. ఆబోగం పీనుగు నిన్నెలాగా పసిపెట్టదూ. దాని దగ్గిర పెద్ద తప్పు కనపడే దాకా వోపిక పట్టి తరవాత నిమిషంలో చేసేస్తాను నీకు పెళ్లి మంచి పిల్లని తెచ్చి. బోలెడు కట్నం వస్తుంది నీకు"

"............"

"ఏమంటావు?"

"నాకు మళ్లీ పెళ్లి చేస్తావా?"

"వొక దెబ్బని"

"............"

"వెళ్లిపోతావేం? వారితో చెబుతావా యేమిట్రా యీమాటా? వొరేయ్! చలపతిగా! వోరి నీ యిల్లు వల్లకాడు—వొరెయ్!"

"............"

"సరే. తగులడు. జ్ఞాపకం పెట్టుకో"

౧౬

చలపతిని వైగ్గారోడ్డులో నుంచోపెట్టి బుచ్చమ్మ తర్జనభర్జన చెయ్యడం సోదెమ్మ చూసింది. ఆమె గోడ అవతలినుంచి పూర్ణమ్మతో చెబుతూ వుండగా ఆమాటలు జగ్గయ్య చెవిలో పడ్డాయి. గాది సావిట్లోకి తీసుకువెళ్లి జగ్గయ్య అడగ్గా చలపతి జరిగిందంతా చెప్పేశాడు. అదంతా విని జగ్గయ్య నెత్తీ నోరూ బాదుకోగా చలపతి గజగజలాడిపోయాడు.

బుచ్చమ్మ యింటికి వచ్చింది గాని మనస్సు మనస్సులో లేదు. ఆ రాత్రి ఆమె తిండి మానేసి ఆపాదమస్తకమూ ముసుగుతన్నుకుని కడుపులో కాళ్లు పెట్టుకుని పడుకుంది.

మన్నాడు పొద్దున్న యింటోకి వచ్చింది; గాని ఆమెతో యెవరూ మాట్లాడ లేదు. అంతా కట్టు కట్టినట్టూ వెలివేసినట్టూ కనపడ్డారు. చలపతి వొకమాటు గదిలోకివెళ్లి జోగమ్మతో గుసగుసలాడి వస్తూ వుంటాడు. పూర్ణమ్మ వంటింటోకీ వెంకటాచలం వీధి గదిలోకీ, అతన్ని పిలుస్తూ వుంటారు. మధ్యమధ్య జగ్గయ్య గాదివసారాలోకి తీసుకు వెళ్లి యేవో అడుగుతూ చెబుతూ వుంటాడు. ఇలాగ యెటుచూసినా గుడగుడలు ప్రబలిపోవడంచేత బుచ్చెమ్మ కేదో బెంగ పట్టుకుంది. గుడగుడశబ్దం కుండకి నష్టం అన్నమాట ఆమెకి తెలుసు; కాని అది యెవరిమీద విరుచుకుపడి పోతుందో.

భోజనాల వేళ బుచ్చమ్మ తాను కూడా పురుషులతోటే కూచుంది. పూర్ణమ్మ నెయ్యి వడ్డిస్తూ "అన్నయ్యగారూ! రాత్రికి నెయ్యి తేవాలి" అని జగ్గయ్యతో చెప్పగా జగ్గయ్య చలపతితో చెప్పాడు. దానికే బుచ్చమ్మ ధుమధుమ లాడుతూ వుండగా జగ్గయ్య తమకి యేవూళ్లో యెంతెంత భూము లున్నాయో, యేభూమిమీద యెంతెంత శిస్తు వస్తుందో—ఇదంతా చెప్పడం మొదలుపెట్టాడు వెంకటాచలానికి.

బుచ్చమ్మ కిదంతా వప్పగింతలు లాగా, ఇక తన ఆవాహనా, విసర్జనా లేనట్టూ కనపడింది. పూర్ణమ్మ అది కావాలా, యిది కావాలా అని యేం వడ్డించడానికి వచ్చినా సంజ్ఞలతోటే భోజనం ముగించి బుచ్చమ్మ లేచిపోయింది.

౨౦

బుచ్చమ్మకి అంతా బోధపడింది. ఇది వరకి తాను రాజ్యం చేసిన యింటో యిక ముందు కూలిపని చెయ్యాలని గ్రహించింది. వొక్కమాటు కళ్లు తిరిగి పోయాయి; గాని వెంటనే ధైర్యం తెచ్చుకుని తనబట్టలు సద్దుకోవడం మొదలుపెట్టింది.

ఇదంతా కనిపెట్టి వెంకటాచలం పూర్ణమ్మతో చెప్పాడు. పూర్ణమ్మ జోగమ్మతో చెప్పింది. జోగమ్మ చలపతితో చెప్పగా చలపతి జగ్గయ్యతో చెప్పాడు. ఇదంతా యిలా అయేటప్పటికి తన సంగతి అందరికీ తెలిసిపోయిందని బుచ్చమ్మ గ్రహించేసింది.

యథాపూర్వంగా వియ్యంకులిద్దరూ వాకట్లో కవాచీబల్లమీద కూచున్నారు. జోగమ్మ యేదో పూదగా చలపతిగూడా వాకట్లోనే పడకకుర్చీలో కూచున్నాడు. "పని తరవాత చేసుకోవచ్చు" అనుకుంటూ పూర్ణమ్మ వంటింటో నుంచుని తొంగిచూడడం మొదలుపెట్టింది. జోగమ్మకి యెప్పుడూ తీరుబడే కనక ఆమె గదిలో మంచంమీద కూచుని యేమిటో ఆలోచిస్తోంది. ఎక్కడా యేమీ చప్పుడేనా కావడం లేదు.

ఇలాంటప్పుడు బుచ్చమ్మ మూట చంకని పెట్టుకుని మెల్లిగా వాకట్లోకి వచ్చి నుంచుంది.

"అదేమిటే అమ్మాయీ?"

"నాయింటికి వెళుతున్నాను నాన్నా"

"ఎందుకూ?"

"ఇక్కడేం వుందీ నాకూ?"

"ఇప్పుడేం వచ్చిందీ?"

"నన్నడగవద్దు. అంతా నీకే తెలుస్తుంది ముందుముందు"

"ఎప్పటికప్పుడే తెలుస్తోంది నాకు వున్నదంతానూ. నీప్రయాణానికి కారణం యేమిటి?"

"తెలిసివుండి అడగడం యెందుకూ?"

"సరే మరీ! ఇంతవరకూ వచ్చాక ఇక బతిమాలితే మాత్రం నువ్వు వుంటావా యేమిటి? బతిమాలడానికి నాకు పెత్తనం వుందా.''

'ధారపోసుకుంటే యెలా వుంటుంది?"

"అదా సంగతి?"

"ఏది యేమయిపోతే నాకేం! నేను వెళ్లిపోతున్నాను"

ఇలా చెప్పి బుచ్చమ్మ వొక్క అడుగు ముందుకు వేసింది.

"అయితే తాళాలు ఇచ్చెయ్యమను నాన్నా"

"............"

"అడగవేం నాన్నా?"

"వినపడిందిటే అమ్మాయీ?''

"పుచ్చుకోండి; నాకక్కర్లేదు''

ఇలా అని గుత్తి మండువాలోకి గిరవాటు వేసి బుచ్చమ్మ ముందుకు మళ్లీ అడుగువేసింది.

వెంటనే పూర్ణమ్మ తటాలున యివతలికి వచ్చి ఆమెకడ్డంగా నుంచుంది. "వెళ్లిపోడానికి యేం కారణం వచ్చిందీ?" అని వెంకటాచలం అడిగాడు. ఇది చూసి బాగుండదని జగ్గయ్య మూట లాక్కోపోయాడు; గాని ఆమె అందర్నీ విదాలించి కొట్టి "అంకరిపాలూ పొంగాయికదా" అంటూ బలవంతానే మూట విడిపించుకుంది.

జగ్గయ్య వెనక్కి తగ్గి "పోనివ్వండి'' అనగా, వెంకటాచలం "తొందరపడకు సుమా'' అన్నాడు. పూర్ణమ్మ కూడా యేదో అనపోయింది; గాని బుచ్చమ్మ వినిపించుకోకుండా "ఎంతలేసి మాంటలేనా వున్నారు భూమ్మీద......నా వుసురు తగలదూ? ఈ పీనుగులు ముందుకి

వస్తారా?" అంటూ వొక్క గంతులో వీధిలోకి వెళ్లి పోయింది.

వాకట్లో యీనాటకం యిలా జరుగుతూ వుండగా చలపతి గదిలోకి వెళ్లి "చూసుకో నామజా" అంటూ అమాంతంగా జోగమ్మని యెత్తి పడేసి వాకట్లోకి చక్కా వచ్చాడు.

౨౧

తరవాత మండువాలో వున్న తాళాల గుత్తి తీసి కడిగి, తుడిచి, మొలలో పెట్టుకుని "రండి భావగారూ!" అంటూ జగ్గయ్య గాది సావిట్లోకి దారితీశాడు. "ఎంత పని చేసిందోయి మీ అక్కా?" అంటూ బుగ్గమీద చెయ్యి పెట్టుకుని పూర్ణమ్మ చలపతిని పరామర్శ చేసింది.

జోగమ్మ యెగిరెగిరిపడుతూ నూద్దగ్గిరికి వెళ్లి "అక్కయ్యగారూ! నేను రమ్మన్నప్పుడు వస్తానన్నారు మీరు. తొరగా—నుంచున్న పళంగా రావాలి" అని చిటికెలు వేస్తూ పిలిచింది.

"ఏంకథా?"

"భామ వెళ్లిపోయింది"

"ఎక్కడికి?"

"అత్తారింటికి"

"ఏం?"

"చెబుతా నలా రండి తొరగాను"

ఆవేదన

కుందుర్తి నరసింహారావుగారు

ఏవగమందో మున్ను వసియించెడివాఁడను: ప్రేలు సూపి న
న్నే నరుఁ డింత చేటు పరికించి యెఱుంగఁ; డిదేమికర్మ? మీ
లో నెటనుండి వచ్చె నసువుల్ తినివేయఁగ, మాయదైవమా?
జేనెఁడు పొట్ట పోసికొన సిగ్గు దొలంగుదు రొక్కొ మానవుల్?
ఈపోఁగాల మిదేమి వీరలకు?—పోనీ! వెంటనే చంపి, యే
దో, పుణ్యంబు రవంత కట్టుకొనరాదో? ప్రేవులన్ మూఁడ్చి న
న్నీ పాట్లన్నియుఁ బెట్ట నేమిటికి? నా కీ పంజరం బేల? ఆ
టోపంబింతయు నేల? ఈడగు నిదెట్లో మావిపై గూటికిన్?

నాపలలం బిసీ! యెటు తినంగలవారలొ వింత యయ్యె! న
న్నాపనికైన బంధనమునం దిడఁగాఁ దమ కేమి పుట్టె? లే
దా, పలుమాఱు సాకుశల మారయుచుండఁగ హేతు వేమి? వీ
రీపగిదన్ ననుం బెనుప నిచ్చఁ దలంచిరొ ప్రీతి చొప్పనన్?
నన్నిటు ముద్దు గొందు రిది న్యాయమె యీచపలాత్ములు? లింతసి
గ్గన్నది లేదె వీరి కకటా! పలుపోకలఁ బోవుచున్న నా